# ఆస్తి

సోమంచి యజ్ఞన్నశాస్త్రి గారు

'ఆస్తి' అనగా వస్తువులను ఉపయోగించుటకును, అనుభవించుటకును, ఇష్టము వచ్చినట్లు చేయుటకును గల ప్రత్యేకహక్కు. ఇది నా 'ఆస్తి' అనగా నావస్తువును నే నుపయోగించుటకును, ఉపయోగింపక పోవుటకును, దానమిచ్చుట, విక్రయించుట, అద్దెకిచ్చుట మొదలగు పనుల చేయుటకును హక్కు నాకు గలదనుట.

ఉపయోగించుటకును, అనుభవించుటకును హక్కు ఉన్నమాత్రమున నది యాస్తి కానేరదు. ఇల్లు నద్దెకిచ్చినపుడు, కాపురమున్నవా రాయింటిని ఉపయోగించి అనుభవించుచున్నారు. కాని అది వారి యాస్తి మాత్రము కాదు. ఇష్టమువచ్చిన ట్లుపయోగించు హక్కే 'ఆస్తి' కి ముఖ్యము. కాపురమున్నవారు అద్దె యింటిని దానవిక్రయాదులు చేయలేరు.

ప్రస్తుతము లోకములో—ఒక్క బోల్షివికు రష్యాలో తప్ప—మనుజుల కున్న హక్కులలో నీ 'ఆస్తి' ఒకటి. అనగా, ఏమనుజుడైనను ఆస్తిని సంపాదింపవచ్చును. అట్లు సంపాదింపబడిన ఆస్తులగురించిన 'న్యాయముల'కై కోర్టువారి సంరక్షణ పొందవచ్చును.

కాని పూర్వమునుండియు అన్నిచోటులను ఈ హక్కు లేదు. అమెరికాలో బానిసత్వ మున్నపుడు బానిసలు ఆస్తిని సేకరించ వీలు లేకుండెడిది. Feudalism లో సాధారణముగా భూమియంతయు ప్రభువులది. రైతులు దానిని కవులుకు తీసుకొన మాత్రము సమర్థులు.

ఫ్రెంచిరివల్యూషనులో వారు గుర్తించినహక్కులలో నొకటి 'ఆస్తి'. అటులనే అమెరికా యింగ్లాండునుండి విడిపోయినపుడు 'ప్రతిమానవునకును—బానిసలు తప్ప—అనగా ప్రతి తెల్లవానికిని—ఆస్తిని సేకరించుటకు హక్కు గలదు' అని గుర్తించిరి.

కాని యీహక్కు మంచిదా, చెడ్డదా యను సందేహము ౧౯-వ శతాబ్ది చివరభాగమునుండి ప్రబలుచు వచ్చినది. రష్యాలో చివరకు ౧౯౧౭ లో ప్రత్యేక ఆస్తు (Individual Private Property) లుండకూడదని తీర్మానించిరి. రష్యాలో ఎవరిమటుకు వా రాస్తులను సేకరించకూడదు. ఆస్తియంతయు సంఘమునకు జెందును. ప్రతిమానవునకును అనుభవించుటకో, ఉపయోగించుటకో మాత్రమే హక్కు గలదు.

కాని మిగిలినదేశము లీపని చేయలేదు. పూర్వము వలెనే ప్రతిమనుజుడును ఆస్తిని సంపాదించి యనుభవింపవచ్చును. కాని కొన్నికొన్ని మార్పులుమాత్రము జరిగినవి.

ఈ పరిణామమునకు కారణము ఆస్తి కొన్ని చెడుగులకు కారణ మగుచున్నదని గుర్తించుటయే. అందుచేత మన మిప్పుడు, ఏ యేకారణములచే 'ఆస్తి' సంఘకల్యాణమునకు కారణమో, ఏవిధముగా నది చెరుపో, యిప్పటి కర్తవ్య మేమో ఆలోచించవలసి యున్నది.

ప్రత్యేకముగా ప్రతియొకరికిని 'ఆస్తి' ఉండవలె ననుటకు కారణములు:

౧. ఏమనుజుడు కష్టపడిన, దాని ప్రతిఫలము నాతడే యనుభవించుట నీతిదాయకము, ధర్మము. చెట్టు నాటినవా డొకడైన ఫలములు తినువాడు మరియొకడుండుట న్యాయము కాదు. బానిసలు కష్టపడి పండించినదానిలో భాగమైనను వారి కీయక యజమానులనుభవించుట తప్పనియే బానిసలను విడిపుచ్చి, వారికికూడ ఆస్తిని సేకరించుకొనుటకు హక్కు నిచ్చుటకు ముఖ్యకారణము.

అది గాక తాను జేసినదానికి ఫలముగ తాను గాక మరియొకడు సౌఖ్యపడు నని తెలిసిన పనిచేయువారరుదుగ నుందురు. అందరును ఆత్మత్యాగు లగుదురా? పనిచేయనివారి సంఘము సోమరిపోతుసంఘమై చెడి

పోవును. అట్టి సంఘమున కధోగతియే కాని ఊర్ధ్వగతి యుండదు. అందుచేత మనుజులు పనిచేయవలెనన్న, వారి ఫలము వారికి ముట్టునను నమ్మక ముండవలయును. అట్టిదియే ఆస్తిని కలిగియుండుటకు గల హక్కు.

౨. మానసికముగ నాలోచించిన మనుజుడు కష్టపడుట కేదైన 'యెర' యుండవలయును. కూలిపనివారి కష్ట మింతింత యనరానిది. ఏ పని చేయుటకూడ కష్టమే. కాని కూలివాడు ధనముకొరకై కష్టపడి పని చేయును. అటులనే ప్రతివాడును. తన కేదైన ప్రతిఫలము ముట్టునని నమ్మక ముండిన గాని యెవ్వనికిని పనిచేయ నిచ్ఛ పుట్టును. అట్టి యిచ్ఛను పుట్టించి మనుజునిచేత పనిని చేయించునది 'ఆస్తి' యే.

3. మనుజు డెల్లకాలమును ఆరోగ్యవంతుడై యుండి పని చేయలేడు. కొంతకాల మతనికి జబ్బు చేయవచ్చును. వార్ధక్యమున పనిచేయుట కష్టము. లేదా పనిచేయ శక్తి యున్నను పని దొరకక పోవచ్చును. పని చేసినపుడు 'ఆస్తి' ని సంపాదించుకొనియున్నచో ఇట్టి సమయముల నాతనికి పనికివచ్చును. కాకపోయిన మిగుల కష్టపడును. అందుచేతనే ప్రతివారును సంపాదదనను కొంత వెనకకు వేసికొని కూడబెట్టుకొందురు. అట్లు కూడబెట్టుకొనుటకు హక్కు ప్రతివారికిని ఉండవలెననుట న్యాయము.

౪. మనుష్య నాగరికతను మనము జూచిన యెడల నాగరికత వృద్ధి పొందుటకు కారణము 'ఆస్తి' యే యని తేలుచున్నది. చరిత్రకు పూర్వకాలమున (Pre-historic) 'ఆస్తి' లేదు. వేటాడి జీవించు నపుడు తాను చంపినదానిని తిని వేసెడివాడు. తొడుగుకొనిన కొన్ని చర్మములు తప్ప 'నావి' అనుకొనుటకు వాని కేమియు లేవు. వారు దేశదిమ్మరులు. వేటాడుచు నెంతదూరమైనను పోయెడివారు. అట్టివారికి విజ్ఞానము, నాగరికత చాల తక్కువ. కాని రాను రాను, 'ఉన్నదానిలో వెనుక వేసికొనుట' ప్రబలినది. ఎక్కువ దొరకిన నాడు కొంత దాచుకొని, దొరకనినా డుపయోగించుకొనెడివారు. తరువాత భూములను వ్యవసాయము చేయుట వచ్చినది. అప్పుడైనను 'ఆస్తి' యంతయు సంఘమునకు చెందియుండెడిది కాని ప్రత్యేకముగా ప్రతి ఒక్కరికిని 'ఆస్తి' లేదు. రానురాను ఎవరిమటుకు వారాస్తిని సంపాదించుకొని, ఉపయోగించుకొనుటకు మొదలిడిరి. అప్పుడే నిజమైన విజ్ఞానము, నాగరికత ప్రబలినవి. 'నాది' యనుదానియం దొకవిధమైన భావ ముదయించును; నాదేశము, నాతల్లి అనుభావములు 'ఆస్తి' కి హక్కు గుర్తింపబడినతరువాతనే వచ్చినవి. అందుచేత నాగరికతకు మూలము 'ఆస్తి' యే.

౫. ఆస్తిమూలమున మరికొన్ని చిన్నిలాభములు కూడ కలిగినవి. ధన మున్నవానికి దానముచేయవలెననుబుద్ధి, బంధువులయెడ ప్రీతి, వారిని పోషించుట మొదలయిన సుగుణము లలవడును. అందుచేత 'ఆస్తి' మూలమున సంఘము చాల లాభములను పొందినది, పొందును. 'ఆస్తి' యే లేకపోయినచో నాగరికత, విజ్ఞానము వృద్ధి పొందవు.

ఈ సమర్థనవాదముల ననుసరించి ప్రతిదేశమునను ప్రతిమనుజునకును 'ఆస్తి' కి హక్కు ఈయబడినది. కాని దీనిమూలమున సంఘమునకు కొన్ని చెడుగులు గూడ కలిగినవి. అందుచేత 'ఆస్తి' కి ప్రతిమానవునకును హక్కుండకూడదనియు, అథవా ఇప్పుడున్నటుల గాక యీహక్కును కొంత మార్చవలెయుననియు నొక బలమైన వాదము బయలుదేరినది. ఈవాదము ననుసరించియే రషియాలో Private Property ని తీసివేసిరి. ఆస్తిని వలదని యెవ్వరును అనరు. కాని 'ఆస్తి' సంఘమున కుమ్మడిగా చెందవలయునా లేక ప్రతిమనుజుడు వేరెవేరె 'ఆస్తి' ని కలిగి యుండవచ్చునా అనునదియే సమస్య.

దీనికి కారణములు :

౧. తాను చేసిన పనికి ప్రతిఫలము తాను పొందవలయుననియు, నట్టిది 'ఆస్తి' మూలమున జరుగుచున్నదనియు చెప్పు వాదము సత్యము కాదు. ఇప్పుడున్న 'ఆస్తి' యేవిధముగ వచ్చినదో మనము పరీక్షచేసి చూచిన యీసంగతి బోధపడును. మనలో

'ఆస్తి' ని కలిగి యున్నవారిలో ముప్పాతికమంది జమీందారులు. వీరందఱును ఒడలు వంచి కష్టపడుట మూలముననే వీరి కీయాస్తి వచ్చినదా? కష్టమే గణింప బడునేని నిజముగ కష్టపడువా డెవ్వడు? తెల్లవారు జామున నాలుగుగంటలనుండి రాత్రి తొమ్మిదిగంటలవరకు, ఎండనక వాననక కష్టించునది రైతా, లేక కాలుమీద కాలు వైచుకొని కూర్చుని, మెత్తనిదిండ్ల కారులలో 'కడుపులోని చల్ల కదలకుండ' తిరుగు జమీందారులా? ఒకరు కష్టించినదాని ప్రతిఫల మింకొక రనుభవింప కుండుటకు 'ఆస్తి' కి హక్కుండవలయునట? కష్టపడునది రైతుబిడ్డ; కవులును తీసికొనినవాడు. అనుభవించునది భూమి నొకమారైనను జీవితకాలములో చూడక, భూమి యేదిక్కున నున్నదో కూడ తెలియని జమీందారుబిడ్డ. ఇది 'ఆస్తి' మూలముననే కదా. ఇదియా ధర్మము, న్యాయము? జమీందారున 'కాస్తి' యెటుల వచ్చినది? దైవవశాత్తు జమీందారునింట పుట్టినంత మాత్రమునకదా! ఇట్టి స్థితిలో 'ఆస్తి' కష్టమునకు ఫలమని చెప్పుట సత్యమా? ఇప్పటిస్థితిలో చాలమటుకు 'ఆస్తి' పుట్టుకకు ఫలముగ కన్పడుచున్నది గాని, కష్టమునకు ఫలముగ కన్పించుట లేదు.

మనము నివసించునది ప్రజాస్వామిక పరిపాలనములో. ఇందు పుట్టుకకు స్థానము లేదు. శక్తియే ముఖ్యము. మాక్డొనాల్డు పూటకు గతిలేనివాని కొమరుడు; పైకివచ్చినది తనశక్తిమూలమున. కాని అంతటివాని కొమరుడు శుంఠ కావచ్చును. మేక్డొనాల్డుకొడుకని యాతనికి ప్రత్యేకస్థానము లేదు. పుట్టుకకు స్థానము లేనపుడు, పుట్టుకపై నాధారపడియుండు 'ఆస్తి' (Hereditary Property) కి కూడ స్థానము లేదు. దీని కుదాహరణము: సంతానము లేని ధనవంతుడు చనిపోయినపుడు పదిహేనుతరములనాటి ౨౦ వేల్లు విడిచిన మేనత్తకొడుకో, పినతల్లికొడుకో, వారసు డొకడు బయలుదేరి 'ఆస్తి' ని తెచ్చుకొనును. అది దేనిపై నాధారపడిన హక్కు? అబద్ధము లాడి కష్టపడినందులకా? కష్టమునకును ప్రతిఫలమైన 'ఆస్తి' కిని సంబంధమే లేదిపుడు. అందుచేత ఈ వాదన సత్యము కాదు.

లేదా, ఒకవేళ కొంచెము సంబంధ ముండినను చాల వ్యత్యాస ముండవచ్చును. రోజంతయు కష్టపడిన కూలివానికి నాలుగణాలు. మోసముచేసి మాయమాటలు చెప్పి దొంగసరకు లంటగట్టు సాహుకారునకు రోజున కేబదిరూపాయిలు.

కాకపోయిన, చేయుపని సంఘమునకు లాభకారి కాకపోవచ్చును. ఆబ్కారీపాట పాడి కల్లమ్మిన వానికి ధనము మిక్కుటముగ వచ్చును. కాని దాని మూలమున సంఘనీతి, శాంతి మొదలయినవి చెడిపోవుచున్నవి. అందుచేత నిట్టి 'యాస్తు' లను కష్టములకు ప్రతిఫలములని సమర్థించుట సత్యము కానేరదు.

౨. రెండవవాదము కూడ—పనిచేయవలెనన్నయెర యుండవలెననుట—సరికాదని రషియావారిపుడు లోకమునకు చాటుచున్నారు. రషియాలో ప్రతివాడును 'ఆస్తి' కూడబెట్టుకొనుటకు వీలు లేదు. 'ఆస్తి' అంతయు సంఘమునకే చెందును. కాని అచట పని చేయుట లేదా? వారి యైదేండ్ల ప్రణాళిక నెగ్గినదని వా రనుకొనిరిగదా!

సోమరితనముకూడ కష్టమే. ప్రతివాడునుకూడ కొంతపనిని చేయ నిచ్చగించును. కాని పని మిగుల కష్టమైన దయినప్పుడే వాడు ప్రతిఫలము కోరును. అందుచేత పని విసుగెత్తకుండ చూచినయెడల మనుజులు ప్రతిఫలము లేకనో, లేక కొంచెము ప్రతిఫలముతోనో—తాను సౌఖ్యముగ నివసించుటకు తగినంతతో—తృప్తిపడును. అందుచే మనుజులచే పనిచేయించుటకు గొప్ప 'ఆస్తు' లవసరము లేదు.

3. కూడబెట్టిన 'ఆస్తి' యంతయు తాను కష్టకాలములం దున్నపుడు సహాయపడుటకు కూడపెట్టినది కాదు. నూటికి ౬౦ రూ.లకు వడ్డీ కిచ్చి, పాపమును కూడబెట్టినట్లు ధనమును కూడబెట్టిన పీనాసి చనిపోవునపుడు డాక్టరునకైన దమ్మిడీ నిచ్చుటకు సమ్మతింపడు. ఇట్టివాటికి సరియైన మార్గము 'ఆస్తి' ని కూడబెట్టుకొనుట కాదు. భీమాలను చేయించుకొనుటయే. ఇంగ్లాండు మొదలయిన దేశములలో పనిలేనివారి

జీవితములకు ఖాయిలాపడినపుడు, ముసలితనమునకు భీమా లున్నవి. వానిమూలముననే నిజమైన, సరియైన సహాయమును పొందగలుగుచుందురు కాని సంపాదించిన 'ఆస్తి' మూలమున కాదు.

౪. అన్నిటికన్నను ముఖ్యమైనకారణ మింకొక టున్నది. మనము చరిత్రను బాగుగ పరికించి చూచిన యెడల నది యంతయు రాజకీయవిషయములవల్ల నైనది కాదు. చాలమటుకు—అంతయుకూడ నని—ఆర్థికవిషయములవలన నేర్పడిన దని, లెనిన్, మార్క్సు (Lenin, Marx) మొదలయిన మహాశయుల యభిప్రాయము. జపానునకును, చైనాకును జరుగు యుద్ధము రాజకీయ సంబంధములవలన కాదు; ఆర్థికవిషయముల వలననే. అటులనే గడచిన ఐరోపాసంగ్రామము, ఫ్రెంచి రివల్యూషను, అమెరికను యుద్ధము, ఇంగ్లండులోని అంతఃకలహము (Civil War) అని చాలమంది యభిప్రాయము. అందుచేత నార్థికవిషయము చాల ముఖ్యమైనది. దానిపైననే దేశకల్యాణము, లోకకల్యాణము ఆధారపడి యుండును.

ఇపుడు లోకములో ధన మెట్లు పంచబడి యున్నదో చూచినయెడల కనిపించునది, వేళ్లమీద లెక్కింపదగు ధనికులు, లెక్కకు మిక్కుటముగు బీదలు. బీదలకు, ధనవంతులకు సంబంధమే లేదు. "బీదలును, ధనవంతులును రెండు కులము" లని యొకరు చెప్పినది చాలమటుకు సత్యము. దీనిమూలమున సంఘమునకు చాల నష్టములు కలవు.

ఏపనినిచేయుటకైనను, ధనము—పెట్టుబడి—అవసరము. అది కొందరివద్దరనే యుండును. కాన వారే ప్రభువులు. బీదలకు వారే ఆధార మగుటవలన బీదలు గొప్పవారిచేతిలో కీలుబొమ్మలు. వారి ప్రాణము లింకొకరిచేతులలో నున్నపుడు వా రేమి చెప్పిన చేయరు? అందుచేత చాలమంది బీదవారు పేరునకు స్వతంత్రులయినను, నిజమునకు ధనవంతులకు బానిసలు. రాజకీయ-బానిసత్వము, మతైక-బానిసత్వము పనికిరాదను నీకాలము ఆర్థిక-బానిసత్వమును సహించునా? సహించిన, పూర్వము చెప్పినటుల, రాజకీయ మార్థికముపై నాధారపడి యుండుటచే నావిషయమున మాత్రము వారు బానిసలు కారా?

మనలో చాలమందికి 'వోటింగు' అధికారము కలదు. ఇందులో నిజముగా, తగినవానికి వోటు నిచ్చెడివా రెందరు? ఇతరలకు లోబడి వోటుచేసెడివా రెందరు? ఒక జమీందారునికడనున్న పరివారమువా రందఱును ఆతనిపై ఏవిధముగ నాధారపడి యున్నను, చెడ్డవా డని తెలిసినను, ఆతనికో, ఆతను చెప్పినవానికో వోటుచేసి తీరవలయునుకదా. లేకపోయిన తమ యుద్యోగము, తిండి పోవు నని భయము. మరి యిక వోటువలని ప్రయోజన మేమి? ఆర్థికముగ దాసానుదాసులై యుండి, మేము రాజకీయముగ వోటుచేయగల యధికారమును పొందియున్నారము గావున స్వతంత్రుల మని చెప్పుకొనుటయందలి యర్థ మేమి? ఎన్ని యెలక్షనులలో ధన మిచ్చి వోటులను వేయించికొనుట లేదు? నిజముగా నాలోచించిన ఎలక్షనులను నీతిరహితముగ జేసి పాడుచేసినది యీధనవంతులే.

రాజకీయముగనే గాక సాంఘికముగకూడ నొకని కడనే ధనరాసు లుండుట చాల అనర్థదాయకము. సంఘమున ధన మున్నవాని మాటయే చెల్లును. బీదవా డెంత సుగుణవంతు డైనను ఆతనిమాట లెక్కకే రాదు. ధనము నెవ రిచ్చి వేనిని కొనిన, వానినే సంఘము తయారు చేయుచుండును. ధనవంతు డొకడు, అనవసరమైనను, పదివేలరూపాయిల నొక మోటారుకారు కొరకీయగలుగును గాన సంఘము మోటారుకారులనే తయారు చేయును. పదివేలమంది 'అన్నమో రామచంద్రా' యని యేడ్చుచున్నను వారు ధనము నిచ్చుకొనలేరు గాన వారిసంగతి నాలకించువారే యుండరు. సంఘకల్యాణమునకు న్యాయబుద్ధితో, ధర్మబుద్ధితో నాలోచించిన ఏది ముఖ్యము? కారా, లేక పదివేలమందికి భోజనమా? అమిత ధనవంతులు లేక, ధనము ప్రతివారికి కొంచెముకొంచె మున్నయెడల ఒకనికి కారు లేకపోయినను, పదివేలమంది కన్నము దొరకియుండును కదా? కారులు మొదలయిన భోగవస్తువుల (luxuries)

ను చేయుటకు ఎంతమంది పనిచేయుచున్నారో? అమితధనము కొందరికడనే కూడియుండినయెడల, వారిమూలమున సంఘముయొక్క శక్తి 'అవసరముల' (necessities) కొరకు కాక భోగములకొరకు వెచ్చింపబడును. Laski మహాశయుడు వ్రాసినట్లు, పదివేల పడిపోవు గుడిసెలప్రక్క నొక రాజసౌధము. వేలకొలది జనమునకు గంజి త్రాగి ప్రాణముల నిల్పుకొనుటకుగూడ లేనపు డొక జమీందారునకు 'సిగరెట్లకాగితము'లు ప్రత్యేకముగ పారిసులోనో, అమెరికాలోనో తయారు కాబడి వచ్చును. ఇదియా న్యాయము?

ఇంతే కాక, ధనవంతులు చేసినపనిని బీదలుకూడ ననుకరింపజూతురు. ధనమదాంధతచే క్రొవ్వియున్న పుల్లమ్మ ధరించిన 'లోలకు'ల వంటివి—డైమండువి కాకపోతే, ఇమిటేషన్‌వైనా సరే—ప్రతి వెంకమ్మ, యెల్లమ్మ ధరించవలసినదే. 'మింగ మెతుకు లేనివాని మీసాలకు సంపెంగనూనె' యను సామెత వ్యర్థమైనది కాదు. ఇట్టివాటిమూలమున దేశములో దారిద్ర్యదేవత తాండవించును. సంఘమున దురాచారములు హెచ్చును కాని కల్యాణమును పెంపొందింపవు. అందుచేత ఇప్పుడున్న విధముగు ప్రత్యేకపు ఆస్తి (Private Property) ప్రజాస్వామికపరిపాలనమునకు, సమత్వమునకు, స్వతంత్రత్వమునకు వ్యతిరిక్తము. అందుచేత 'ఆస్తి'ని ఇప్పుడున్నటులకాక మార్చుటయో, లేక పూర్తిగా తీసివేయుటయో ముఖ్యావసరము.

ఒకవేళ పనిచేయుటకు కొంత 'ఆస్తి' రూపకమైన ప్రతిఫల మవసరమని యొప్పికొనినను, ఇప్పుడున్న పరిస్థితులు దానికి సహాయకారిగ నుండుట లేదు. ఇప్పుడు ధనమున్నవారు 'వారికే మమ్మ, తండ్రులు గడించి పెట్టారు. హాయిగా కాలిమీద కాలేసుకు తినొచ్చు' ననే స్థితిలో పడ్డారు. పని చేయకపోయిన సంఘము సోమరిదగును. పనిచేయవలెనన్న 'ఆస్తిని' చేసికొనుటకు హక్కుండువలె ననునది వ్యర్థవాద మగుచున్నది. 'ఆస్తి' యుండుటచే పనిచేయుట మానివేయుచున్నారు, చాలమంది. అందుచే ధనమే సోమరిసంఘమును తయారు చేయుచున్నదేమో యను అనుమానము గల్గుచున్నది.

౫. మన మిప్పుడు ధనదాసులము. ధనదాహ మందరికి మెండు. ధనమును పూజచేయుచున్న కాలమిది. 'రూపాయిలో దేవు డున్నా' డనునది సామెతైపోయినది. దీనికి కారణము 'ఆస్తి' యే. లెక్కకు వచ్చినది ధనమే కాని, ధన మెట్లు సంపాదింపబడినదో యెవ్వరికిని అక్కరలేదు. 'వెధవపబ్బు. బోగంది గడిస్తుంది' అను మాటలు పాతమాట లయినవి. ధనవంతునకే అందరును చేతు లెత్తుట. ఆధనము ప్రజలను మోసము చేసి సంపాదించినను సరియే. అందుచేత నిపుడు ప్రతివానికి ఎంత త్వరితకాలములో — మంచినో, చెడ్డనో—గొప్పవా డగుట యెట్లా యనెడి చింత తప్ప వేరొకటి లేదు. అందుచేత సంఘము చెడిపోయి, నీతిబాహ్యముగు మన్నది కాని మరొకటి కాదు.

దేశములోని రాజ్య మందరికొరకును ఏర్పడి యున్నది కాని దేశములోని ఒకపక్షమువారికొరకు కాదు. కాని ఎపుడును ధన మున్నవారి చేతియందే అధికార ముండుటవలన జరిగెడి పనులన్నియు వారి సౌకర్యముకొరకే జగుగునుగాని బీదల సౌకర్యముకొరకు గాదు. నూటికి ఒకడో యిద్దరో ధనవంతులు కొను కారులపై సుంకముల తగ్గింతురు కాని, ఊరక వచ్చిన, దానిమూలమున నింకొక వస్తువు బీదలకు కొన వీలగునట్లు చేయు, ఉప్పుమీది పన్నుకు లెక్కచేయువా రెవరును ఉండరు. టోలుగేట్లు కారుల కక్కరలేదట, ఎద్దుబండ్ల కుండవలెనట!

అందుచే రాజ్యము, సంఘము ధనవంతుల దగుచున్నది కాని ప్రజల దగుట లేదు. దీని మూలమున 'న్యాయము, ధర్మము, నీతి' మంట గలియుచున్నవి. మొన్న మాస్కోయందు బ్రిటిషువారిని విచారణ చేయుచు, రషియను కోర్టులు న్యాయస్థానములు కావనినదానికి జబాబుగ నచటి న్యాయవాదిగారు 'ఆదేశములలో బీదల కొకవిధమైన న్యాయమును, ధనవంతులకు మరియొకవిధ మయిన న్యాయమును గలదు. కాని రషియాలో న్యాయ మందరికి నొకటే' అనిరి.

ఈదుర్గుణము లన్నియు మూర్తీభవించినవారు మన 'మహారాజులు.' వీరు తిండిలేక మలమల మాడు ప్రజల

కడనుండి పన్నులను వసూలుచేసి, సంవత్సరమున కారు నెలలు పారిసులోనో, లండనులోనో గడపి ధనము నంతయు తగులవేసెదరు. వీరినిగురించి యెంతకఠినముగ వ్రాసినను అన్యాయము, అసత్యము కానేరదు.

అందుచేత ఇప్పటి సమస్య: మంచికంటె చెడుగులనే యెక్కువగా గల యీ 'ఆస్తి' కి హక్కును ప్రతిమనుజునకును యివ్వకుండ, రష్యాలో వలె పూర్తిగా సంఘమునకే యిచ్చుటా, లేక 'ఆస్తి' యొక్క చెడుగు దేనివలననో కనుగొని, ఆచెడుగులు రాకుండ యీహక్కును మార్చుటా?

'ఆస్తి' ని పూర్తిగా తీసివేసిన, దానియొక్క మంచికూడ పోవును. వ్యాధిగల మనుజుని వ్యాధిని తీసివేయక, మనుజునే సంహరించినట్లు, 'ఆస్తి' నే పూర్తిగ తీసివేసిన, ఉండు నని చాలమంది పెద్దల యభిప్రాయము. రష్యాలోకూడ నీమధ్యన కొన్నివిధము లైన వస్తువులను 'ఆస్తి' గా స్వీకరించవచ్చు ననియనిరి.

ఇన్ని చెడుగులకు ముఖ్యకారణము ధనము చాల కొద్దిమందిదగ్గర సర్దుకొనుటయే. అందుచేత ముఖ్య ముగ చూడవలసినది, యెవరికడనుకూడ ధనరాసులు కూడకుండుటయే. అందుచేతనే కాంగ్రెసువారు, ఉద్యోగమునకు నెలకు ౫౦౦ రూ. ఉండిన చాలు నని యభిప్రాయపడిరి. ౧౦ రూ. సంపాదించువారు ౧౦ వేల మంది, ౨౫ వేలు సంపాదించువారు ముగ్గురు ఉండుట కంటె అందరును ౫౦ రూ. మొదలు ౪౦౦ రు. వరకు కలిగియుండుటే సంఘమునకు కల్యాణదాయకము. అందుచేత చెడుగులను తగ్గించుటలో నొక విధము ఇంతకంటె యెక్కువ జీతము లుండరా దనుట. ప్రతిదేశములోను ఈ సంగతి గుర్తింపబడినది. తన సొమ్ము కాదని పంచిపెట్టే హిందూదేశంలో తప్ప, ఎక్కడా యింత హెచ్చు జీతములు లేవు. అది గాక Income-tax, Super-tax, Profession-tax ల మూలమున కొంత సంఘమునకు చేరు చున్నది.

లోకములో గనులు, భూమి మొదలయినవి స్వభావసిద్ధములు. వీనిని మనుష్య ప్రయత్నముచే నెక్కువచేయలేము. కావలెనన్న ఒక్క రోజులో కొన్నికోట్ల గజముల గుడ్డను తయారుచేయవచ్చును. కాని సెంటుభూమినికూడ కల్పించలేము. అందుచేత వీనిని జాగ్రత్తగా వాడుకొనవలెను. భూమి యున్న గాని ధాన్యము పండించుటకు వీలు లేదుగదా? ఒక లక్షాధికారి చుట్టుప్రక్కల భూముల నన్నిటిని కొని చాల ఎక్కువకు గాని కవుల కీయనని పట్టుపట్టిన మరి సామాన్యుల గతి యేమి? ఇట్టిస్థితి యేర్పడినపుడే పూర్వము రోము నందును, గ్రీసునందునుకూడ కొన్ని యెకరముల భూమి కంటె నెవ్వరును ఉంచుకొనకూడదను శాసన మొకటి యుండెడిది. అట్టిశాసన మొకటి ముఖ్యావసరము.

అది గాక, యీ హక్కునకు గలది—ఉపయోగించిన ఉపయోగించవచ్చును, లేకపోయిన ఊరుకొన వచ్చును. అందుచే 'గడ్డివాములోని శునకము' వలె స్వభావసిద్ధమయినవాటిని (భూమి మొ.) ఉపయోగింపకపోయిన, ఎవరికిని లేకుండచేసినవా రగుదురు. అట్టివి జరుగకుండ చూడవలెను.

కష్టపడకుండ ఎవరికిని ధనము అనవసరముగా రాకుండ చూచుట చాల ముఖ్యమైనది. అనగా, తండ్రి సంపాదించిన సొమ్ము కాలుమీద కాలు వేసికొని తిను వారి సంఖ్య తగ్గించవలెను. ఇంగ్లాండు మొదలయిన దేశములలో ఎస్టేటుదారు చనిపోయి, ఆతనికొడుకు దాని కధికారి అయిన అతనికడనుండి ౫౦% వరకు పన్నుక్రింద తీసికొందురు. ఇందుమూలమున తండ్రి సంపాదించిన అంత ధనమునకును ఆత డధికారి గాక, కొంతయైనను రాజ్యమున కిచ్చును.

ఇప్పటికాలమున 'ఆస్తి' చాలమటుకు పెట్టుబడి మూలమున ఉన్నది. మిల్లులయందో, వ్యాపారమునందో పెట్టుబడి యైయున్నది. అట్టి 'ఆస్తి' యొక్క హక్కును మూడువిధములుగ విభజింపవచ్చును—

i వడ్డీని అనుభవించుటకు

ii లాభములను పొందుటకు

iii అధికారము చేయుటకును, స్వాధీనమునం దుంచుకొనుటకును గలహక్కులు (right to control).

వీనిలో ఒక్క మొదటిదాని ననుభవించుటకే న్యాయమైన యధికార మున్నది. లాభమును అందరితోను కలిసి—మిల్లునకు పెట్టుబడి పెట్టిన, మిల్లులో పని చేయువా రందరితో కలిసి—యనుభవించవలెను. అధికారము చేయు హక్కుండకూడదు. గవర్నమెంటు సెక్యూరిటీలలో ధనమును పెట్టుబడి పెట్టినను కూడ గవర్నమెంటువారి పై నధికారము చెలాయించుటకు ఎట్లు వీలు లేదో, అట్లే మిల్లులో పెట్టుబడి పెట్టినను కూడ మిల్లును స్వాధీన పరచుకొనుటకు అధికార ముండకూడదు. అట్టి అధికారము రాజ్యమునకో, సంఘమునకో యుండవలయును.

వీనిని చేసినయెడల ‘ఆస్తి’ వలన కలుగు చెడుగులు చాలమటుకు తగ్గిపోయి దాని మంచిలాభము లనుభవించుటకు వీలగును. ప్రజాస్వామికరాజ్యములో ఇప్పుడున్నటువంటి ‘ఆస్తి’ కి తావు లేదు. లేకపోయిన ప్రజాస్వామిక రాజ్యము వెక్కిరింపు, కన్నీళ్లతుడుపు కాని నిజము కానేరదు.

---

# ప్రేమగాయకుఁడు

బాలాంత్రపు వేంకటరావుగారు

౧

మాన్యుఁడగు రాము చరిత రామాయణముగ
మానవతి సీత చరిత రామాయణముగ
మానవప్రేమచరిత రామాయణముగ
మాని వెలయించెఁ దన ప్రేమగానమందు—

౨

సీత పూతచరిత్ర ప్రసిద్ధమయ్యెఁ
గుశ లవ సురూప విభవంబు విశదమయ్యె
జానకీపతిముది సుప్రసన్నమయ్యె
మానిరత్న దివ్య ప్రేమగానమందు—

౩

లలిత సుకలాభ్యుదయమూర్తి లవునియందు
కుశలమంత్రాభ్యుదయమూర్తి కుశునియందు
చిరపవిత్రాభ్యుదయమూర్తి సీతయందు
మాని వెలయించెఁ దన ప్రేమగానమందు—

౪

ఇతఁడె-ఆ ప్రేమగాయకుఁడు-ఇతఁడె-యితఁడె
యీతఁడె-యితండె యని పంచభూతములును,
దశదిశ, లనంతభువనముల్, శశలుఁ బవలు,
పాడి చెప్పుచునున్నవి నాఁడు-నేఁడు—

---